క్లుప్తంగా

స్థలం కేటాయించండి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్య సభ్యులు

ధర్మవరం అర్బన్: విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్య భవన నిర్మాణం కోసం 10 సెంట్ల స్థలం కేటాయించాలని శ్రీసాయి రూరల్ విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్య అధ్యక్షురాలు కాంతమ్మ, ఉపాధ్యక్షుడు కొండయ్య, సభ్యులు ఈశ్వరమ్మ, లక్ష్మీదేవి, ఈశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 44 గ్రామాలలోని విభిన్న ప్రతిభావంతులతో కలిపి మండల సమాఖ్య ఏర్పాటు చేసుకున్నామన్నారు. అద్దె భవనంలో సంఘం కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు.

చేపల వేలం వాయిదా

తనకల్లు: కొక్కంటి నారప్పనాయని చెరువులో చేపలు పట్టుకోవడానికి నిర్వహించాల్సిన వేలం పాటను వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి బాబ్‌జాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనటానికి ఎవ్వరూ ఆసక్తి చూపకపోవడంతో పైఅధికారుల ఆదేశాల ప్రకారం వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. చేపట వేలంపాటను మరోసారి నిర్వహిస్తామని, అందుకు సంబంధించిన వివరాలను త్వరలో తెలియజేస్తామని వెల్లడించారు.

కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో కాలభైరవస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డు సమీపంలోనున్న కాలభైరవస్వామి గుడిలో సోమవారం విగ్రహ ప్రతిష్టను వేద మంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అర్చకులు గణపతిపూజ, నవగ్రహ, రుద్ర, దీక్ష, సుదర్శన హోమాలను అర్చకులు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఇప్పటి వరకు దాతలు ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.2 లక్షల వరకు విరాళాలు అందించారని నిర్వాహకులు ఈశ్వరయ్య, గోపాల్‌రెడ్డి, గుర్రం ఈశ్వరయ్య, శ్రీనివాసులు, సాంబ, చింత శ్రీనివాసులు, శివారెడ్డి తదితరులు తెలిపారు.

నైపుణ్యం వెలికితీసేందుకే సైన్స్‌ఫేర్



నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

ముదిగుబ్బ: విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడం కోసమే సైన్స్‌ఫేర్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వేమనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విశ్వభారతి స్కూల్‌లో సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరై విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సింగారెడ్డి, ఉపాధ్యాయులు చితంబర్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

కనగానపల్లి: పేద ప్రజలకు ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సీపీఐ మండల నాయకులు అధికారులను కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఒక్క పేద కుటుంబానికి కూడా రేషన్‌కార్డు మంజూరు చేయలేదన్నారు. మండలంలో చాలా మంది పేదలు రేషన్‌కార్డులు లేని వారు ఉన్నారని తెలిపారు. వారికి వెంటనే కార్డులు మంజూరు చేసి రేషన్‌సరుకులు అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, నాయకులు మల్లికార్జున, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు అవగాహన

ఎన్పీకుంట: దిన్నెమీదపల్లి ఆర్డీటీ పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యత కౌన్సెలర్ వీరమారుతి మాట్లాడుతూ నేడు కుటుంబ ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దడంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. పొదుపు సంఘాలు, వ్యాపారం, స్వయం ఉపాధి ద్వారా సంపాదన ఆర్జిస్తూ అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఎక్కువ మంది మహిళలు బ్యాంకు ఖాతాలు కలిగి ఉన్నారని, ఈ నేపథ్యంలో వారికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ మేనేజర్ రాజేష్, కౌన్సెలర్లు నారాయణ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

సర్వదేవతల సంగమేశ్వరం

● మహా శివరాత్రికి ఏర్పాట్లు



పార్వతీ సమేత పంచలింగ సంగమేశ్వరుడు



సంగమేశ్వరంలోని ఆలయం

బత్తలపల్లి: ఎత్తైన కొండలు.. విశాలంగా పరుచుకున్న పంట పొలాలు.. పచ్చగా మెరిసే సుందర ప్రాంతమే సంగమేశ్వర క్షేత్రం. బత్తలపల్లి మండలం అప్పరాచెరువు పంచాయతీ పరిధిలో వెలసిన ఈ క్షేత్రం వివిధ దేవాలయాలకు నిలయంగా విరాజిల్లుతోంది. ప్రముఖ పుణ్యక్షేత్రాల వద్ద సరస్సులు ఉన్నట్టే ఇక్కడి ప్రతి దేవాలయం వద్ద చిత్రావతి, దూబిలేరు, పాలేరు నదులు కలుస్తున్నాయి. ప్రతి సంగమం వద్ద ఈశ్వరాలయం ఉన్నట్లుగానే ఇక్కడా శివుడిని ప్రతిష్ఠించారు. దీంతో ఈ క్షేత్రాన్ని సంగరామేశ్వరంగా కూడా పిలుస్తారు. ఇలాంటివి ఉత్తర భారతదేశంలో దేవ ప్రయాగ, రుద్రప్రయాగ, నంది ప్రయాగ, త్రివేణ సంగమంలో ఉన్నాయి. వాటి సరసన ఈ దేవాలయం కూడా చెప్పవచ్చు. వాటిని తీర్థ ప్రదేశాలుగా పిలుస్తారు. తీర్థ ప్రదేశాలకు మనదేశ చరిత్రలో అత్యంత ప్రముఖ స్థానం ఉంది. ఈ సంగమేశ్వరాలయానికి కూడా అదేవిధమైన ప్రసిద్ధి ఉంది. ఈశ్వరాలయానికి సంబంధించి కొన్ని చారిత్రక ఆధారాలున్నాయి. శ్రీకృష్ణదేవరాయలు పరిపాలనా సమయంలో ఆస్థాన మంత్రికి భరణంగా ఇచ్చి అప్పాజీ పేరుతో అప్పరాజుచెర్ల గ్రామాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.

శివరాత్రి వేడుకలకు ముస్తాబు

సంగమేశ్వర క్షేత్రంలో ఈ నెల 25న మహా శివరాత్రి ఉత్సవాలకు దేవాలయాన్ని ముస్తాబు చేశారు. 27వ తేదీ సాయంత్రం ఉత్సవాలు ముగుస్తాయి. 26న బత్తలపల్లి, సంగమేశ్వర క్షేత్రంలోనూ పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుంది. బత్తలపల్లిలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర ఆలయంలో సైతం శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేపట్టారు. శివరాత్రి పర్వదినాన 26న ఉదయం 6 నుంచి 9 గంటల వరకు స్వామి వారికి సామూహిక రుద్రాభిషేకం ఉంటుంది. 10 గంటల నుంచి ప్రత్యేక అలంకరణ, మహా మంగళహారతి, స్వామి వారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలను అందజేస్తారన్నారు. సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వరక్షేత్రంలోనూ, దంపెట్లలోని శ్రీలక్ష్మీచెన్నకేశవాలయంలోనూ, మాల్యవంతం, రామాపురంలోని వీరనారాయణ స్వామి దేవాలయాల్లో సైతం వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శివరాత్రి అనంతరం మరుసటి రోజు రామాపురం సమీపంలోని చిత్రావతి నదిలో వీరనారాయణస్వామి జాతర నిర్వహిస్తారు. ఈ జాతరకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. పన్నారపు బండ్లు దేవుని చుట్టూ ప్రదక్షణలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శివరాత్రి జాగరణతో శుభాలు



శివరాత్రి పండుగ రోజు జాగరణ చేస్తే మంచి శుభఫలితాలు లభిస్తాయి. శివున్ని భక్తితో పూజించడం వల్ల అనుకున్న కార్యాలు జరుగుతాయి. ఉపవాసాలతో దీక్ష చేసి, మరుసటి దినం దీక్షలను ఉపసంహరించుకుంటారన్నారు. అదేవిధంగా మాఘమాసం దీక్షలు చేపట్టిన భక్తులు సైతం దీక్షలను శివరాత్రి పండుగ నుంచి ఉపసంహరించుకుంటారు.

– అమళ్ళదిన్నె జయకుమార్, అర్చకులు, సంగమేశ్వర క్షేత్రం

తాతలకాలం నాటి రహదారి ధ్వంసం

రహదారి పునరుద్ధరించాలని ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు విన్నవిస్తున్న బాధిత రైతు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ధర్మవరం: తాతలకాలం నాటి ఉన్న రహదారిని ధ్వంసం చేసి పొలాలకు వెళ్లకుండా ఇబ్బందులు కలిగిస్తున్నారని బత్తలపల్లి మండలం ఉప్పర్లపల్లికి చెందిన రైతు నాగభూషణరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆర్డీఓ మహేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. బాధిత రైతు నాగభూషణరెడ్డి మాట్లాడుతూ దంపెట్ల రెవెన్యూ పరిధిలోని ఉప్పర్లపల్లిలో సర్వే నంబర్ 28లో తనకు 13 ఎకరాల పొలం ఉందని, అందులో చీనీ సాగు చేస్తున్నానని చెప్పాడు. అదే గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు కాటమయ్యకు సంబంధించి అసైన్‌మెంట్ భూమి సర్వే నంబర్ 4, సర్వే నంబర్ 30లో ఏళ్ల తరబడిగా తమ పొలానికి వెళ్లేందుకు రహదారి ఉందన్నాడు. ఈ రహదారి గుండానే పొలానికి వెళ్లి వ్యవసాయం చేసేవారమని చెప్పాడు. పది రోజుల క్రితం రైతు కాటమయ్య, హొసికేరప్పలు ఇద్దరూ అనుచర వర్గంతో కలిసి వెళ్లి రహదారిని ధ్వంసం చేశారన్నాడు. అప్పట్లో తహసీల్దార్ స్వర్ణలతకు తాము ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన రహదారిని పునరుద్ధరించాలని ఆదేశించారని గుర్తు చేశాడు. అయినప్పటికీ తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరు చేస్తూ రహదారి చుట్టూ కంచె వేసి ఆక్రమించారన్నారు. దీంతో తాము పొలంలోకి వెళ్లి నీరు పెట్టలేకపోవడంతో చీనీచెట్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆర్డీఓ స్పందిస్తూ తహసీల్దార్‌కు వెంటనే ఫోన్ చేసి బాధిత రైతుకు న్యాయం చేసి రహదారిని పునరుద్ధరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంగల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నల్లబోయినపల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుమ్మళ్లకుంట జయరామిరెడ్డి, దంపెట్ల సర్పంచ్ కరుణాకర్‌నాయుడు, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, వీరనారప్ప, గరిశనపల్లి చెన్నారెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నల్లమాడ: నల్లమాడను కరువు మండలంగా ప్రకటించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎదుట నిరసన చేపట్టారు. ఒకరి హక్కు, అనుభవంలో ఉన్న భూములను కొందరు అక్రమ మార్గాల్లో తమ పేరున ఆన్‌లైన్ చేయించుకొని 1బీ, అడంగల్‌తో పాటు బ్యాంకుల్లో రుణాలు సైతం పొందారని, అలాంటి వాటిని తొలగించి నిజమైన రైతులకు పూర్తి హక్కు కల్పించి, అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు బకాయి బిల్లులు చెల్లించి విరివిగా పనులు కల్పించాలన్నారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రంగనాయకులుకు అందజేశారు. రైతు సంఘం నాయకులు పి.చంద్రమోహన్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ రాజారెడ్డి, ఆర్‌సీపీ నాయకులు గంగాద్రి, సీపీఐ రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యులు చంద్ర, సీఐటీయూ మండల నాయకులు గోవిందు, అంజినప్ప, గిరిబాబు నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సాగు చేయని భూమికి పట్టా రద్దు చేయాలి

తనకల్లు: బొంతలపల్లి రెవెన్యూ గ్రామంలో బొంతల శాంతమ్మకు ప్రభుత్వం మంజూరు చేసిన భూమి పట్టాను రద్దు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 183లో అన్నమయ్య జిల్లా మొలకలచెరువులో కాపురం ఉంటున్న బొంతల శాంతమ్మకు 30 ఏళ్ల క్రితం రెండు ఎకరాలు ప్రభుత్వ భూమికి పట్టా మంజూరు చేశారన్నారు. అయితే ఆమె ఏరోజూ పంటలు సాగు చేయలేదన్నారు. సాగు చేయని భూమికి ఇచ్చిన పట్టాను వెంటనే రద్దు చేసి, అందులో పేద దళిత కుటుంబాలకు ఇంటి పట్టాలను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీ నరసింహులు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు



బత్తలపల్లి ప్రమాదంలో గాయపడిన గంగాధర్, ఆదినారాయణ, తిరుపతయ్య

బత్తలపల్లి: వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమందేపల్లి మండలం పందిపర్తి గ్రామానికి చెందిన గంగాధర్ సోమవారం రాత్రి తాడిపత్రి సమీపంలోని బుగ్గ వద్దకు కారులో వెళ్లి తిరుగుపయనమయ్యాడు. ఇదే సమయంలో తాడిమర్రి మండలం పిన్నదరికి చెందిన ఆదినారాయణ ఆటోలో స్వగ్రామానికి వెళ్తున్నాడు. బత్తలపల్లి మండల కేంద్రంలోని జగనన్నకాలనీ వద్ద రోడ్డు దాటుతున్న ఒంగోలు జిల్లా కనిగిరి తాలూకా సీఎస్ పురానికి చెందిన బేల్దారి తిరుపతయ్యను తప్పించే క్రమంలో ఆటో, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గంగాధర్, ఆదినారాయణతో పాటు తిరుపతయ్య తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి 108 వాహనంలో వారిని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించి.. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఆటో అదుపుతప్పి...

నల్లచెరువు: జోగన్నపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తనకల్లుకు చెందిన బండ్రేవు రామిరెడ్డి, పఠాన్ షెక్షావలి, పఠాన్ లాహిర్ వలి అనే వ్యక్తులు ఆటోలో కదిరికి వెళ్లి మిక్చర్ వ్యాపారం చేసుకొని తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. నల్లచెరువు మండలం జోగన్నపేట సమీపంలోకి రాగానే ఆటో అదుపు తప్పి జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగురూ తీవ్రంగా గాయపడటంతో స్థానికులు గమనించి కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా శివలింగం, నంది విగ్రహాల ప్రతిష్ట



శివాలయంలో ప్రతిష్ఠించిన శివలింగం

ఓడీచెరువు : బోయపల్లిలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్మించిన శివాలయంలో సోమవారం శివలింగం, నంది విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. తొలుత పురోహితులు పంచరత్న సురేష్ శర్మ, మహేష్ స్వామి గణపతి హోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం నిర్వహించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

నల్లమాడ: మండల కేంద్రంలోని వైఎస్సార్ కూడలి సమీపాన కల్వర్టు కింద నాగేంద్ర (42) అనే మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. నాగేంద్ర సోదరుడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేసేవారు. అప్పట్లో సోదరులిద్దరూ తల్లితో కలిసి ఇక్కడే ఉండేవారు. పదేళ్ల క్రితం టైపిస్టుకు కళ్యాణదుర్గం బదిలీ రావడంతో కుటుంబంతో సహా వెళ్లిపోయారు. అయితే నాగేంద్ర వారి వెంట వెళ్లలేదు. ఇక్కడే ఉండిపోయాడు. కొంత కాలానికి మతిస్థిమితం కోల్పోయి వీధుల్లో భిక్షాటన చేసుకుంటూ చిత్తు కాగితాలు సేకరించి విక్రయించి జీవనం సాగించేవాడు. అనంతరం మతిస్థిమితం కోల్పోయి వీధుల్లో భిక్షాటన చేసుకొంటూ చిత్తు కాగితాలు (గుజిరీ) సేకరించి విక్రయించడం ద్వారా వచ్చే పైకంతో జీవనం సాగించేవాడు. సోమవారం వైఎస్సార్ కూడలి సమీపంలో కల్వర్టు కింద నాగేంద్ర మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

అనాథాశ్రమంలో వైద్య శిబిరం

ధర్మవరం రూరల్: గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు సోమవారం శ్రీసత్యసాయి సేవా సమితి-2 కన్వీనర్ సాంబశివుడు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, సేవా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కదిరి టౌన్: పట్టణంలోని మాధురి హోటల్ రాజారెడ్డిని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. రాజారెడ్డి భార్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సోమవారం కదిరికి వచ్చి రాజారెడ్డిని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

బాధ్యతగా బోధించాలి

ఎన్పీకుంట: అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలకు ప్రాథమిక విద్యను బాధ్యతగా బోధించాలని సీడీపీఓ రాధిక సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు బోధనాభ్యాస సామగ్రిని తయారు చేసుకొని చిన్నారులకు సులభతరంగా అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. అలాగే ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రాలను బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, సూపర్‌వైజర్లు నరసమ్మ, మౌలాబీ, లక్ష్మీదేవి, ఆర్‌సీలు మహేశ్వరరెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు, కేబుల్ వితరణ

కదిరి అర్బన్: మండలంలోని పట్నం గ్రామానికి వీధిలైట్లు, కేబుల్‌ను అయ్యప్పస్వామి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తిమ్మయ్య సోమవారం బహూకరించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ చలపతినాయక్‌తో పాటు గంగిరెడ్డి, పవన్ కుమార్, బాబు, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏకవార పంచామృత రుద్రాభిషేకం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని శివాలయంలో మాఘమాస సోమవారాన్ని పురస్కరించుకుని శివునికి ఏక వార పంచామృత రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శివ లింగాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అఖండ దీపారాధనతో పాటు వివిధ రకాల పూజలను అర్చకులు రఘునాథశాస్త్రి బృందం నిర్వహించారు. మాఘమాసం చివరి సోమవారం కావడంతో చిన్నారులను స్వామి ముందుంచి నామకరణం చేశారు.

నేటి నుంచి జాగరణ మహోత్సవాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ నాగేంద్ర

ఎన్పీకుంట: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గూటిబైలు గ్రామంలోని తిమ్మమాంబ ఆలయంలో ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు జాగరణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటలకు రథోత్సవం, చెక్క భజన, 26న ఏపీ టూరిజం గైడ్ ఎద్దుల మనోహర్ చేత తిమ్మమాంబ, బాలవీరయ్య సంపూర్ణ జీవిత చరిత్ర బుర్రకథ, 27వ తేదీన అమ్మవారికి ప్రత్యేక పూజలు, బుర్రకథ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం రాత్రి తిమ్మమాంబ రథోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

తిమ్మమ్మమర్రిమాను వద్ద మంగళవారం నుంచి నిర్వహించే శివరాత్రి జాగరణ మహోత్సవ ఏర్పాట్లను కదిరి రూరల్ సీఐ నాగేంద్ర సోమవారం పరిశీలించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఐ వలిబాషా, తలుపుల ఎస్ఐ నరసింహుడు పాల్గొన్నారు.

నేటి నుంచి పీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

ధర్మవరం: ఈ నెల 25, 26 తేదీల్లో పీఎస్‌యూ రాష్ట్ర మూడో మహాసభలు ధర్మవరంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న ఉదయం 10.30 గంటలకు పీఎస్‌యూ జాతీయ కార్యదర్శి షఫీవుల్లా, రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు, పీఎస్‌యూ ప్రతినిధులు వందలాది మంది విద్యార్థులతో కలిసి అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఎన్జీఓ హోం వరకు ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. ఎన్జీఓ హోంలో మహాసభలు జరుగుతాయని తెలిపారు.

నారాయణసేవ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సుబ్బదాసు సత్రంలో సోమవారం నారాయణసేవ నిర్వహించినట్లు శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సాంబశివుడు తెలిపారు. దాదాపు 600 మందికి అన్నదానం, 260 మందికి ఉచితంగా మందుల పంపిణీ చేశారు.

గోవుకు అంత్యక్రియలు

కదిరి అర్బన్: కుటాగుళ్ల సమీపాన జాతీయ రహదారి పక్కన కల్వర్టులో పడి మృతి చెందిన గోవుకు మున్సిపల్ సిబ్బంది సహకారంతో హిందూ ధార్మిక సంస్థల సభ్యులు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. గోవులు దేవతలతో సమానమని, ప్రతి ఒక్కరూ గో సంరక్షణకు తోడ్పాటు నందించాలని వారు పిలుపునిచ్చారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఆస్తి నష్టం

కనగానపల్లి: సీఎస్ కోట గ్రామానికి చెందిన చిన్నయ్య ఇంట్లో సోమవారం సాయంత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో సామగ్రి, వంట సరుకులు, విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. రూ.లక్ష దాకా నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

వృద్ధుడి మృతి

చెన్నేకొత్తపల్లి: మేడాపురంలో వారం క్రితం చింతచెట్టుపైనుంచి జారి పడగా తీవ్ర గాయాలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరసప్ప (68) పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. ఈయనకు భార్య, కుమారులు ఉన్నారు.

ఆహ్లాదం.. అందనంత దూరం

● మున్సిపల్ పార్కుల్లో కానరాని పచ్చదనం
● విరిగిపోయిన ఆట వస్తువులు
● నిర్వహణ అస్తవ్యస్తం



దుర్గానగర్ పార్కులో మూలనపడిన ఆట వస్తువులు



దుర్గానగర్ పార్కులో ముళ్లపొదలు, చెత్తాచెదారం



పార్కులో విరిగిపోయిన ఆట వస్తువులు



జారుడుబండకు మధ్యలో పడిన రంధ్రం



శివానగర్ పార్కులో మెట్లు లేని జారుడు బండపై అవస్థలు పడుతున్న చిన్నారి

ధర్మవరం అర్బన్: నిర్వహణ లోపంతో పార్కులు అధ్వానంగా మారాయి. చిన్నారులు ఆడుకునే పరికరాలు ధ్వంసమయ్యాయి. పెద్దలు కాసేపు సేద తీరేందుకు పచ్చిక కనిపించదు. పుర ప్రజలకు ఆహ్లాదం ఎండమావిగా మారిపోయింది. ధర్మవరంలోని దుర్గానగర్, మారుతినగర్, శివానగర్‌లో మున్సిపల్ పార్కులు ఉన్నాయి. అందులో పిల్లలు ఆడుకునేందుకు వస్తువులు, పెద్దలు సాయంత్రం వేళ సేద తీరేందుకు పచ్చని గడ్డితో మైదానం గతంలో ఉండేవి. ప్రస్తుతం వీటి నిర్వహణను గాలికొదిలేశారు. పార్కుల్లో జారుడు బండలు విరిగిపోవడంతో మూలన పడేశారు. ఆట వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా దుర్గానగర్ పార్కులో ఆట వస్తువులు విరిగిపోవడంతోపాటు చెత్తాచెదారంతో కళావిహీనంగా మారింది. శివానగర్ పార్కు విరిగిన జారుడుబండను ఎక్కేందుకు మెట్లు లేవు. జారే వాటికి మధ్యలో రంధ్రాలు పడి చీలికలు ఏర్పడ్డాయి. అలాంటి వాటితోనే ఆడుకునేందుకు చిన్నారులు ప్రయత్నిస్తూ.. కిందపడుతున్నారు.

ఏటా నిధుల కేటాయింపు

ప్రతి ఏటా మున్సిపల్ బడ్జెట్‌లో పార్కులు, గార్డెన్ అభివృద్ధి కోసం రూ.5 లక్షల నుంచి రూ.7లక్షల వరకు నిధులు కేటాయిస్తున్నారు. కానీ ఆ నిధులతో పార్కుల అభివృద్ధి చేపట్టలేదు. ప్రజల నుంచి ఇంటి పన్నులను సక్రమంగా కట్టించుకునే మున్సిపల్ అధికారులు వారికి పార్కుల్లో తగిన సౌకర్యాలు కల్పిద్దామని ఏరోజూ ఆలోచించలేదు. పుర పాలకులు సైతం వీటిని విస్మరిస్తున్నారు.

దుకాణాల నిర్వహణకు నేడు బహిరంగ వేలం

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర స్వామి ఆలయం వద్ద దుకాణాల నిర్వహణ కోసం మంగళవారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ అధికారి నరసింహరాజు తెలిపారు. కొబ్బరి కాయల అమ్మకం, తలనీలాల సేకరణ, గాజుల అమ్మకాలు, ఆట వస్తువుల వ్యాపారాల నిర్వహణ కోసం వేలం పాటను (15 రోజుల వ్యవధికి) నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
8008554500, 9912220726
9010593486, 9912220717